ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
గురువారం 26 సెప్టెంబరు 2024





అమలుకు నోచుకోని ఫసల్ బీమా



- ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న రైతులు

PMFBY
PRADHAN MANTRI
FASAL BIMA YOJANA

ఆసిఫాబాద్, సెప్టెంబరు 25: ప్రకృతిని నమ్మి పంటలు సాగు చేస్తున్న రైతన్నలకు పంటలపై భరోసా లేకుండా పోతోంది. ఆరుకాలం కష్టపడి సాగు చేసిన పంటలు విపత్తుల కారణంగా నష్టపోతున్నా ప్రభుత్వాలు మాత్రం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు మృతి చెందితే రైతుబీమాను అమలు చేసి కుటుంబాన్ని ఆదుకుంటున్నారు. కానీ రైతు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లితే మాత్రం సహాయం అందిస్తున్న దాఖలాలు లేవు. కేంద్ర ప్రభుత్వం రైతులు సాగు చేసిన పంటలకు (పీఎం ఎఫ్‌బీవై) పథకాన్ని అమలు చేస్తుండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పథకంలో లోపాలున్నాయని పక్కన పెట్టింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బీమా పథకాన్ని పునరుద్దరించనున్నట్లు వెల్లడించినా ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో స్పష్టత లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే రైతులను ప్రభుత్వం పంటలకు బీమా కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లుగా పత్తాలేని పథకం..

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫిబ్రవరి 18, 2016న ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రీమియం చెల్లించిన రైతులకు బీమా కంపెనీలు స్వల్ప నష్టపరిహారం చెల్లించడం, పరిహారం చెల్లింపుల్లో ఆలస్యం తదితర కారణాలతో 2019లో అనేక రాష్ట్రాలు పథకం నుంచి నిష్క్రమించాయి. ఇందులో భాగంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పథకంలో లోపాలున్నాయంటూ ఫసల్ భీమా యోజనపథకాన్ని పక్కనపెట్టింది.

పరిహారం దక్కక..

కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన (పీఎం ఎఫ్‌బీవై) పథకం రాష్ట్రంలో అమలు కాకపోవడంతో రైతులకు అటు ప్రభుత్వం నుంచి ఇటు బీమా కంపెనీల నుంచి సకాలంలో పరిహారం దక్కడంలేదు. ఈ ఏడాది వానకాలం సీజన్‌లోనే బీమా పథకాన్ని పునరుద్దరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో స్పష్టత కొరవడింది. జిల్లాలో జూలై, ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పత్తి, కంది, ఇతర పంటలు భారీగా నష్టపోయాయి. జిల్లా వ్యాప్తంగా 5500ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేసినప్పటికీ జిల్లాలో సుమారుగా 10వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఫసల్ బీమా లేకపోవడంతో ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి పంటనష్టం జరిగినప్పుడల్లా అన్నదాతలు ఆర్థికంగా చితికి పోతున్నారు.

అప్పటి నుంచి రాష్ట్రంలో పంట బీమా అమలు కావడంలేదు. ఏటేటా ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, వరదల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నా పంట పరిహారం అందటంలేదు. 9 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వానాకాలంలో సీజన్‌లోనే ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించినా వివిధ కారణాల వల్ల జాప్యం జరిగింది. బీమా విషయంలో ప్రభుత్వం చర్చల దశలలోనే ఉంది. దీంతో తాజాగా వచ్చిన వరదలతో రైతులకు మరోసారి పంటనష్టం జరిగి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. ప్రభుత్వ విధి విధానాలు ఇంకా నిర్ణయం కాకపోవడంతో ఈ ఏడాది కూడా బీమా నిష్ప్రయోజనంగానే మిగిలింది.

ఏటా అతివృష్టి..

రైతులు సాగుచేస్తున్న పంటలు ప్రకృతి వైపరిత్యాలు, పంటతెగుళ్ల కారణంగా పంటల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో ఏటా అతివృష్టితో రైతాంగం తీవ్రంగా పంటలు నష్టపోతున్నారు. మూడు సంవత్సరాలుగా వానకాలం సీజన్‌లో అధిక వర్షాలు కురవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2021-22వానాకాలం సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 35వేల ఎకరాలలో పంట నష్టం వాటిల్లగా, 2022-23 వర్షకాలం సీజన్‌లో 48 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

ఈ ఏడాది ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు సుమారుగా 10వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఇసుక మేటలు ఏర్పడి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. అయినప్పటికీ ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులు సాగు చేసిన పంటలు అతివృష్టి కారణంగా నష్టపోతున్న విషయం తెలిసినా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ప్రయత్నం చేయక పోవడం బాధాకరం.

పంటలకు బీమా అమలు చేయాలి..: పుల్గం పోశం, రైతు



రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలి. రైతులు ఆరుకాలం కష్టపడి అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే విపత్తుల కారణంగా నష్టం వాటిల్లుతోంది. రైతులు సాగుచేసిన పంటలకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించి బీమా కల్పిస్తే రైతులకు భరోసా కలుగుతుంది.

విధివిధానాలు రాలేదు..: మిలింద్, వ్యవసాయాధికారి



పంటల బీమా విషయంలో వ్యవసాయశాఖకు ప్రభుత్వం నుంచి ఎలాంటి విధివిధానాలు రాలేదు. పంటలబీమా విషయంలో రాష్ట్రప్రభుత్వం చర్చలు, సమావేశాలు చేపడుతోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన (పీఎం ఎఫ్‌బీవై) పథకంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రైతులకు పంటబీమా పథకం అమలు చేస్తాం.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 25: జిల్లాలో అక్టోబరు3నుంచి 9వరకు జరిగే ఓపెన్‌టెన్త్, ఇంటర్‌పరీక్షలను సజావుగాజరిగే విధంగా చూడాలని అధికారులను కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌తో కలిసి జిల్లా విద్య, వైద్యఆరోగ్యపోలీసు,విద్యుత్,మిషన్ భగీరథ, మున్సిపాలిటీ, ఆర్టీసీఅధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓపెన్‌టెన్త్ పరీక్షలకోసం జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల, ఇంటర్‌పరీక్షల కోసం జన్కాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పదవ తరగతిలో 165మంది, ఇంటర్‌లో 110మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్నివసతులు కల్పించాలని, ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సులు నడిపించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, డీఎంహెచ్‌వో తుకారాం, సీఐ సతీష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికులు కలెక్టర్ వెంకటేష్‌దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 144 మంది కార్మికులను తీసుకోవాలని, జీవో నెం.60 ప్రకారం కేటగిరివైజ్‌గా వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంతకు ముందు వారు మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మికులు రాజయ్య, శ్రీకాంత్, పద్మ, సుజాత, లక్ష్మి, పెంటుబాయి, సంధ్య, కళావతి, ప్రసాద్, మల్లేష్, శ్రీనివాస్, అశోక్, నగేష్, జగ్గారావు, సాగర్, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఏఎంసీ చైర్మన్

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 25: హైదరాబాద్ పట్టణంలో మంత్రి శ్రీధర్‌బాబును మాజీఎమ్మెల్సీ పురాణం సతీష్, ఆసిఫాబాద్ మాజీఏఎంసీ చైర్మన్ గాదవేణిమల్లేష్ బుధవారం మర్యాదపూర్వకంగాకలిశారు.ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధి చేపట్టాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో అనీల్, తదితరులు పాల్గొన్నారు.

రేపు షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25:ఈనెల27న జిల్లాకేంద్రంలోని టీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల పాఠశాల గ్రౌండ్‌లో అండర్-19షూటింగ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని షూటింగ్‌బాల్ జనరల్ సెక్రెటరీ గురువేందర్ తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికేట్, నాలుగు ఫొటోలు, బొనఫైడ్ సర్టిఫికేట్‌తో పీఈటీ చిన్నక్కను సంప్రదించాలన్నారు.

హాస్టల్‌లో మెనూ పాటించాలి

కెరమెరి, సెప్టెంబరు 25: సంక్షేమహాస్టళ్లలో మెనూప్రకారం భోజనం అందించాలని జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం హట్టి ఆశ్రమపాఠశాలను సందర్శించి మెనూ పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో స్వచ్ఛతహీ సేవాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ

మెదక్ ఎంపీని కలిసిన కొంగ సత్యనారాయణ



ఎంపీ రఘునందన్‌రావుతో కొంగ సత్యనారాయణ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 25: మెదక్ ఎంపీ రఘునందన్‌రావును హైదరాబాద్‌లో బుధవారం బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ కలిశారు. సిర్పూరు పేపర్ మిల్లులో కార్మికుల పట్ల యాజమాన్యం తీరుపై వివరించారు. ఎన్నికల కోసం ట్రేడ్ యూనియన్ నాయకులు రిటర్న్ సమర్పించినట్టు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల పరిస్థితిపై వివరించారు.

ఘనంగా పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 25: ఆసిఫాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పండిత్‌దీన్ దయాల్ ఉపాధ్యాయజయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, మాజీజడ్పీటీసీ అరిగెలనాగేశ్వర్‌రావు, మాజీఎంపీపీ అరిగెలమల్లికార్జున్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడలో ప్రతిభ



తిరుపతి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25: ఈనెల3 నుంచి 14వరకు అమన్‌జోర్డాన్‌లో జరిగిన 10వఅంతర్జాతీయ హ్యాండ్‌బాల్‌యూత్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీల్లో ఆసిఫాబాద్ సాంఘికసంక్షేమ గురుకులం విద్యార్థి తిరుపతి భారతదేశం జట్టులో స్థానం సంపాదించాడు. దేశంతరపున పోటీల్లో పాల్గొని మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పీడీ శంకర్, పీఈటీలు యాదగిరి, కోచ్ ప్రవీణ్, తదితరులు అభినందించారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ



శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న లెర్నింగ్ కర్వ్, బీపీసీఎల్ సంస్థ సభ్యులు

వాంకిడి, సెప్టెంబరు 25: వాంకిడి కేజీబీవీపాఠశాలలో విద్యార్థినులకు బుధవారం ప్రాజెక్టుడిగ్నిటీ పేరుతో లెర్నింగ్‌కర్వ్, బీపీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్స్, ఇన్సినెటర్ యంత్రాన్ని అందించారు. ఆడపిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శానిటరీపాడ్స్, యంత్రాన్నిపంపిణీ చేశామని, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిడీఈవో ఉదయ్‌బాబు, ఎంఎస్‌వో శివచరణ్‌కుమార్, జేఈసీవో భాగ్యలక్ష్మి, బీపీసీఎల్ టెర్రిటోరీ మేనేజర్ శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 25: జిల్లా కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో బుధవారం షీటీంసభ్యులు విద్యార్థులకు షీటీంసేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణ, భద్రతకోసం షీటీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్, టిసేఫ్‌యాప్, ఆత్మహత్య, డ్రగ్స్, బాల్యవివాహాలు, వరకట్నం చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 1930, షీటీం8712670564నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షీటీంశ్రీలత, ప్రధానోపాధ్యాయుడుమహేశ్వర్, ఉపాధ్యాయులున్నారు.

కుమరం భీం వర్ధంతి కమిటీ

కెరమెరి, సెప్టెంబరు 25: వచ్చేనెల 17న నిర్వహించే కుమరంభీం వర్ధంతి కమిటీని బుధవారం జోడేఘాట్‌లో ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా భీం మనుమడు సోనేరావు, అధ్యక్షుడిగా పెందూర్ రాజేశ్వర్‌రావు, కన్వీనర్‌గా పెందూర్ మోతీరాంను ఎన్నుకున్నారు.

పోలీసులకు డ్యూటీమీట్



ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తున్న పోలీసు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 25: జిల్లాపోలీసుల ఉత్తమప్రతిభ ఆధారంగా జోనల్, రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక కోసం బుధవారం జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లాస్థాయి డ్యూటీమీట్‌ను నిర్వహించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొదటిసారిగా డ్యూటీ మీట్ సందర్భంగా జిల్లాస్థాయిలో అధికారులు, సిబ్బందిలో ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా పోలీసుకార్యాలయంలో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్ హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, బాంబు డిస్పోజల్‌స్క్వాడ్, పోలీసు జాగిలాలు, వివిధ విభాగాలలో ట్రాకింగ్ ఎక్స్ప్లోజీవ్ విభాగాలలో పోటీలు నిర్వహించామని తెలిపారు. అన్నివిభాగాలలో కలిపి 30మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యం



గని వద్ద మాట్లాడుతున్న జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్

మందమర్రి టౌన్, సెప్టెంబరు 25: సింగరేణిలో ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. మందమర్రి ఏరియాలోని కేకే5 గనిని సందర్శించి మాట్లాడారు. కార్మికుల రక్షణకు పెద్దపీత వేస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరు విధిగా రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం ఆయన గనిలోకి దిగారు. ఆయనవెంట మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, కేకే1 గ్రూపు ఏజెంట్ రాందాస్, ఏరియా రక్షణాధికారి రవిందర్ పాల్గొన్నారు.

సేఫ్టీ జీఎంకు ఘనసన్మానం

కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్‌ను మందమర్రి జీఎం దేవేందర్, ఇతర అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఏరియాను సందర్శించిన సందర్భంగా ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గనిమేనేజర్ ప్రవీన్, గ్రూపు ఏజెంట్ రాందాస్, సలేంద్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించండి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25: ఓసీపీలలో పనిచేసే ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు వైవీరావు, కందికట్ల వీరభద్రయ్య సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలోని ఈపీ ఆపరేటర్లతో బుధవారం వారు సమావేశం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి చేయడంలో ఈపీ ఆపరేటర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈపీ ఆపరేటర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాంచ్‌కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కేంద్ర కార్యదర్శి జూపాక రాంచందర్, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

రెబ్బెన, సెప్టెంబరు 25: రెబ్బెన గోలేటి సింగరేణిహైస్కూల్‌లో ఈనెల27న ఉమ్మడిఆదిలాబాద్ బాల్‌బ్యాడింటన్ ఎంపికపోటీలు అండర్-19విభాగం బాలబాలికల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడిఆదిలాబాద్ బాల్‌బ్యాడ్మింటన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు అక్టోబరులో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల వారు ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని సూచించారు.

కార్మికులను మోసగించడం సరికాదు: టీబీజీకేఎస్



శ్రీరాంపూర్: ఎస్‌వోటు జీఎం ఎన్. సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న పెట్టెం లక్ష్మణ్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25: సింగరేణి యాజమాన్యం లాభాల వాటా 33శాతం ఇస్తామని కార్మికులను మోసగించడం సరికాదని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ అన్నారు. లాభాల వాటాలో జరిగిన మోసాన్ని నిరసిస్తూ ఆయూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు వచ్చిన నికరలాభాలు 4701కోట్ల రూపాయలన్నారు.వాటి నుంచి 33శాతం లాభాలు అందిస్తే 1551కోట్ల రూపాయలు కార్మికులకు రావాల్సి ఉందన్నారు. కానీ 796 కోట్ల రూపాయలు మాత్రమే పంపిణీ చేస్తామనడం ఏ మేరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం వెంటనే స్పందించి 1551కోట్ల రూపాయలను కార్మికులకు లాభాల బోనస్ రూపంలో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణకు అందించారు. కార్యక్రమంలో కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: సింగరేణి కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వెల్లడించిన విధంగా 4700కోట్లు 33శాతంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీబీజీకేఎస్ నాయకులు ఎస్‌వోటూ జీఎంకు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు జాతీయ రహదారి నుంచి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, బడికెల సంపత్, బెల్లం అశోక్ పాల్గొన్నారు.

రెబ్బెన: టీబీజీకెఎస్ నాయకులు బుధవారం బెల్లంపల్లి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకెఎస్ వైస్‌ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.4700కోట్లనుంచి కాకుండా రూ.2388 కోట్ల నుంచి మాత్రమే 33శాతం పంచటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు మంగీలాల్, వెంకటేష్, సంపత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు

రెబ్బెన, సెప్టెంబరు 25: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్‌కు జీతాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు గత ప్రభుత్వం ఏమాత్రం జీతాలు పెంచలేదన్నారు. ఔట్‌సోర్సింగ్, వేజ్‌బోర్డులో జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. కోల్ ఇండియాలో పెంచారన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండు చేశారు. ధర్నాలో నాయకులు శ్రీను, పోశం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'అందరికీ లాభాల వాటా చెల్లించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25 : సింగరేణిలో పనిచేసే అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకూ లాభాల వాటా చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా 5వేల రూపాయలు చెల్లించేందుకు తమ యూనియన్ ఎంతో కృషి చేసిందన్నారు. అయితే అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులకు చెల్లిస్తారా లేదా కొన్ని విభాగాల వారికే పరిమితం చేస్తారా అని చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. అధికారులు ఈ విషయంలో క్లారిటీ ఇచ్చి అన్నివిభాగాల కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలని ఆయన కోరారు.

రెబ్బెన: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుందరికీ లాభాల వాటా చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వైస్‌ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాస్ రావు డిమాండు చేశారు. బుధవారం గోలేటిలోని నర్సరీ కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీకార్మికులకు కూడా సింగరేణి లాభాలవాటా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియాకార్యదర్శి మారిన వెంకటేష్, అలవేణి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కైరిగూడ ఓసీలో వాటర్‌స్ప్రే యంత్రం ఏర్పాటు

రెబ్బెన, సెప్టెంబరు 25: కైరిగూడ ఓపెన్‌కాస్టులో బుధవారం నూతనంగా వాటర్‌స్ప్రే యంత్రాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రాజెక్టు అధికారి నరేందర్, గని మేనేజర్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వాటర్ స్ప్రే యంత్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సెఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జీ మేనేజర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హాజీపూర్, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకవ్యక్తిమృతిచెందారు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే లక్షెట్టిపేట వైపు నుంచి మంచిర్యాలకు వస్తున్న లారీ మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని, గాయపడిన వ్యక్తికి మంచిర్యా ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. వీరు వాంకిడి మండలా నికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ విషయంపై ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా తమకు ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుత్ నిలిపివేశారని స్తంభం ధ్వంసం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25 : శ్రీరాంపూర్‌లోని అరుణక్క నగర్‌లో బిల్లులు చెల్లించకపోవడంతో సిబ్బంది విద్యుత్ కట్ చేశారని ఆగ్రహించిన ఓ వ్యక్తి బుధవారం విద్యుత్ స్తంభం ధ్వంసం చేశాడు. ఆకుదారి వెంకటేశ్ తండ్రి కిష్టయ్య పేరిట రెండు విద్యుత్ మీటర్లున్నాయి. ఒక మీటర్‌కు 8వేల 769 రూపాయలు, మరో మీటర్‌కు 4 వేల 362 రూపాయలు బిల్లులు వచ్చాయి. వాటిని చాలా నెలలుగా చెల్లించడం లేదు. దీంతో విద్యుత్ సిబ్బంది బుధవారం ఉదయం వారి ఇంటికి విద్యుత్ నిలిపివేశారు. ఆగ్రహించిన వెంకటేశ్ మధ్యాహ్నం సమయంలో తన ఇంటి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని గొడ్డలితో ధ్వంసం చేశాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా జరుగుతోంది. సపోర్ట్ తీగ ఉండడంతో పోల్ కింద పడిపోలేదు. లేనిపక్షంలో పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది కరెంట్ నిలిపివేసి మరమ్మతు చేసే పనిలో పడ్డారు. వెంకటేశ్ చేసిన పనితో అదే పోల్‌కు కనెక్షన్ ఉన్న ఇతర ఇళ్లకు సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై ఏఈ రామ్మూర్తిని వివరణ కోరగా... మధ్యాహ్నం సమయంలో వెంకటేష్ విద్యుత్ స్తంభం ధ్వంసం చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే అక్కడికి వెళ్లి విద్యుత్ నిలిపివేశామని తెలిపారు. స్తంభం ధ్వంసంపై శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

అధికారి వేధింపులు ఆపాలి

జన్నారం, సెప్టెంబరు 25 : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వచ్చిన తనను సీనియర్ అసిస్టెంట్ శమీమ్ ఉద్యోగ రీత్యా వేధిస్తున్నారని, మానుకోవాలని సీనియర్ అసిస్టెంట్ సవిత కోరారు. బుధవారం జన్నారంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జన్నారం డివిజన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు శమీమ్ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జీగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇటీవల బదిలీపై తాను సీనియర్ అసిస్టెంట్‌గా వచ్చానని తెలిపారు. తాను శమీమ్‌కంటే సీనియర్ కావడంతో సూపరింటెండెంట్ పోస్టు తనకు రాకుండా చేస్తున్నారని వివాపోయారు. ఈ క్రమంలో డిప్యూటేషన్ ఆదేశాలు తెప్పించి వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. దీంతో తాను కాళేశ్వరం జోన్ అధికారి దగ్గరకు వెళ్లి తన డిప్యూటేషన్ ఆర్డర్స్ రద్దు చేయించుకున్నానని తెలిపారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఆమె కోరారు.

నలుగురికి జైలు శిక్ష

జన్నారం, సెప్టెంబరు 25: మండలానికి చెందిన బట్ల అన్వేష్ అనే వ్యక్తిని 2020 మే 16న జన్నారం మండల కేంద్రానికి చెందిన గాలిపెల్లి హరీష్‌కుమార్‌గౌడ్, ముత్యం సాయి, పాట్కుట్ ప్రశాంత్, మహ్మద్ అజ్మత్ ఖాన్ అనే వ్యక్తులు దాడి చేసి కులం పేరుతో దూషించి మూత్రం తాగించిన కేసులో బుధవారం నలుగురికి ఆరు నెలలు జైలు శిక్ష, ఒకొక్కరికి నాలుగు వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల కోర్టు లైజ న్ అధికారి సయ్యద్ తాజోద్దీన్, సీడీవో అహ్మద్‌లు తీర్పు వెల్లడించారు. ఎస్సై రాజవర్ధన్ మాట్లాడుతూ అప్పటి ఎస్సై తాజోద్దీన్ కేసు నమోదు చేసిన ప్రకారం శిక్ష విధించనట్లు తెలిపారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముస్కు రమణారెడ్డి సాక్షులను విచారించిన నేపథ్యంలో వీరికి శిక్ష విధించినట్లు తెలిపారు.

ఒకరికి రిమాండ్

జన్నారం, సెప్టెంబరు 25: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెంది న మోదెల భూమక్క అనే వ్యక్తి నుంచి పది వేల రూపాయల నగదును కుమ్మంపాటి యూసుఫ్ అనే వ్యక్తి లాక్కున్నారన్న ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు అడిషనల్ ఎస్సై తానాజీ తెలిపారు. భూమక్క బ్యాంకు నుండి పది వేలు డ్రా చేసుకొని చింతపల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కుమ్మంపాటి యూసుఫ్ డబ్బులు లాక్కొని వెళ్లినట్లు తెలిపారు.

పద్మశాలి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

జన్నారం, సెప్టెంబరు 25: కిష్టాపూర్ గ్రామ పద్మశాలి సంఘం పదవీ కాలం ముగియడంతో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసాల మహేష్, ఉపాధ్యక్షుడిగా అయ్యోరి సత్తన్న, ప్రధాన కార్యదర్శిగా వాసాల భాస్కర్, క్యాషియర్‌గా అంకం మహేష్ ఎన్నికయ్యారు. సభ్యులుగా లక్ష్మీనారాయణ, లచ్చన్న, మల్లేష్, సత్తన్న, వేణు, నరేష్, రాయమల్లు, మల్లేష్, శ్రీనివాస్, భూమన్న, సతీష్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.

వందే భారత్ రైలును మంచిర్యాలలో నిలుపాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25: వందేభారత్ రైలును మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలుపాలని కోరుతూ బుధవారం సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మంచిర్యాల రైల్వేస్టేషన్‌మేనేజర్ రవీందర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మేకల దాసు, కలీందర్‌అలీఖాన్, మల్లయ్య, శ్రీనివాస్, పౌలు, పోచన్న, శంకరయ్య, వెంకటేశం, రాయమల్లు,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

హాజీపూర్, సెప్టెంబరు 25: మండలంలోని రాపల్లి, టీకనపల్లి గ్రామాల్లో పత్తి, వరి పంటలను బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ పంటల్లో పిందె రాలడం, రసం పీల్చే పురుగులను గుర్తించామని చెప్పారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి కల్పన మాట్లాడుతూ పతి పంట సాగు చేస్తున్న రైతులు చీడపీడలు, యాజమాన్య సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నాగరాజు, ఏవో కృష్ణ, ఏఈవో ప్రసన్న, రైతులు తిరుపతి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ట్రస్ట్ ద్వారా సేవలు అభినందనీయం

దండేపల్లి, సెప్టెంబరు 25: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు-సురేఖ దంపతులు మంచిర్యాల నియోజకవర్గంలో నిరుపేద ప్రజలకు ఆదుకునేందుకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవ కార్యక్రమాలు చేపడుతూ అండగా నిలుస్తు న్నారని లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, ఎమ్మెల్యే సోదరిమణిలు రుక్మిణి, శ్రీసత్యశ్రీ అన్నారు. దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్, పెద్దపేట, ధర్మరావుపేట ద్వారకా, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్, నంబాల, గూడెం, ముత్యంపేట, కొర్విచెల్మ గ్రామాల్లో రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆడపడుచులకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్, శకుంతల, కాంతరావు, మాజీ ఎంపీటీసీలు కమలాకర్, శ్రీనివాస్, మణెమ్మ, మౌలిక, మోహన్, రాజన్న, నాయకులు శంకరయ్య, బుచ్చన్న, లక్ష్మన్, వెంకటేష్, సృజన్, స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ నుంచి ప్రశంసాపత్రం



డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్‌హెచ్‌వో దేవయ్య

బెల్లంపల్లి, సెప్టెంబరు 25: బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎస్‌హెచ్‌వో దేవయ్య ప్రజలకు సత్వర సేవల్లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం లభించినందుకు బుధవారం హైదరాబాద్‌లో డీజీపీ చేతుల మీదుగా ఎస్‌హెచ్‌వో దేవయ్య ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని డీజీపీ సూచించారు.

'బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

గర్మిళ్ల, సెప్టెంబరు 25: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంచిర్యాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నస్పూర్ మున్సిపల్ ఛైర్మన్ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే కమీషన్ల కోసం గోదావరి నదిపై బ్రిడ్జిని అడ్డుకుంటున్నారని చేసిన ఆరోపణలను నిరూ పించాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ రాదన్నారు. సమా వేశంలో నాయకులు పూదరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పోషకాహారం తీసుకోవాలి

కాసిపేట, సెప్టెంబరు 25: బాలికలు పోషకాహారం తీసుకోవడం వల వ్యాధులు దరిచేరవని రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) టీం కన్వీనర్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. గిరిజన పోషణ మిత్ర కార్యక్రమాన్ని బుధవారందేవాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రారంభించారు.. డిప్యూటీ డీంఎహెచ్‌వో డాక్టర్ సుధాకర్‌నాయక్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే బృందం సభ్యులు సాయిశరణ్య, గోపి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ హెచ్‌ఎం రొడ్డ గోపాల్, పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో 'పోలీస్ డ్యూటీ మీట్'

- ప్రారంభించిన పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

కోల్‌సిటీ, సెప్టెంబరు 25: తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి మంచిర్యాల్ జోన్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలం గాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ నిర్వహించామని చెప్పారు. ఇందులో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్ అధికారులకు, సిబ్బందికి పలు విషయాలపై ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్ నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో ప్రతిభ చాటిన వారు అక్టోబరు 4న రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించే కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీకి ఎంపిక ఉంటుందన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బంది జోన్ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి రామగుండం కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఆర్‌ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్ మల్లేశం, శ్రీనివాస్, కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం**

గోదావరిఖని, సెప్టెంబరు 25: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. 28న జాతీయ లోక్ అదాలత్ జరుగనున్న దృష్ట్యా కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది రాజీపడే అవకాశం ఉన్న కేసులను గుర్తించాన్నారు. ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీపడేలా అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని సీపీ తెలిపారు.



పోలీస్ డ్యూటీ మీట్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జైపూర్, సెప్టెంబరు 25: జిల్లాలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో బుధవారం పలువురికి సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వం పెద్ద ఎత్తున చేసేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం పౌనూరు మాజీ సర్పంచు జాడి మల్లయ్య బీజేపీలో చేరగా ఆయనకు కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దుగుట రాజ్ కుమార్, చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ అక్కల రమేష్, నాయకులు అశ్విన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

చెన్నూరు, సెప్టెంబరు 25: చెన్నూరు పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్యార్థినీలకు మహిళ చట్టాలు, బాలికల భద్రత, సైబర్ మోసాలు వంటి అంశాలపై చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్‌కౌన్సిల్ సభ్యులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

గర్మిళ్ల, సెప్టెంబరు 25: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫారం నంబరు 2 గద్దెపై నుంచి బుధవారం గుర్తు తెలియని వ్యక్తి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

హాజీపూర్, సెప్టెంబరు 25: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీహెచ్‌వో ఎన్‌సీడీ లక్ష్మణ్‌స్వామి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సబ్బపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పొగాకు వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలపై సీహెచ్‌వో ఎన్‌సీడీ లక్ష్మణ్‌స్వామి, హెచ్‌ఈవో పద్మలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు లక్ష్మీ, జ్యోతిర్మయి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూరు: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్వేత అన్నారు. కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసులు బుధవారం యువత మంచి భవిత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మండల కమిటీ

దండేపల్లి, సెప్టెంబరు 25: తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి దండేపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా సందెలా తిరుపతి, ఉపాధ్యక్షులుగా ముత్యాల గంగయ్య, అముదాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగాబోర్లకుంట రమేశ్, కోశాధికారిగా ఎర్రం రమేశ్, స్పీకర్ షరీఫ్, ప్రచార కార్యదర్శిగా ప్రభాకర్, సందెల తిరుపతి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నారకట్ల రాజామౌళి, కార్యవర్గ సభ్యులుగా లచ్చన్న, శ్రీకాంత్, ఫయాజ్, రాజు, మనోహర్, చంద్రశేఖర్, నర్సింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం

మందమర్రిరూరల్, సెప్టెంబరు 25: మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న మహిళా శక్తి క్యాంటీన్ పనులను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఐకేపీ ఏపీఎం లలితకుమారి, ఏపీవో రజియాసుల్తానా పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

తాండూర్, సెప్టెంబరు 25: మండలంలోని రైతులకు సహకార సంఘంలో ఎరువులను అందుబాటులో ఉంచామని సంఘం అధ్యక్షుడు దత్తుమూర్తి అన్నారు బుధవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 510 మంది రైతులకు గాను 221 మంది రైతులకు రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ అయినవారికి మళ్లీ రుణాలు ఇవ్వనున్నామని చెప్పారు. సమావేశంలో మురధర్‌రావు, రత్నాకర్‌రావు, తిరుపతి, సంతోష్‌కుమార్, రాజన్న, తిరుపతి, పార్వతి, సత్తమ్మ, రఫూఫ్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

తాండూర్: మండలంలోని ద్వారకాపూర్, కొత్తపల్లి, అచ్చలాపూర్ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

దండేపల్లి: మందమర్రిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికవడంతో బుధవారం పలువురు అభినందించారు.

నస్పూర్: నస్పూర్ సబ్ స్టేషన్‌కు కుందారం వెళ్లే 33కేవీ కొత్తగా ఇంటర్ లింకు లైన్ వేయడం కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు ఆర్ అండ్ ఆర్, సీతారాంపల్లి, నస్పూర్ టౌన్ ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో ఉండదని ఏఈ రాంమూర్తి తెలిపారు.

చెన్నూరు: పట్టణంలో తిరుగుతున్న కుక్కలను చంపాలని ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త రామ్‌లాల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మందమర్రిరూరల్: పొన్నారం గ్రామంలో బుధవారం మంచిర్యాల పోస్టాఫీసు బ్రాంచ్ మేనేజర్ సాగర్ బీమా ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించార

కాసిపేట: కాసిపేట మండల ఇన్‌చార్జీ ఎంఈవోగా ముక్కవరపు వెంకటేశ్వరస్వామి బాధ్యతలు స్వీకరించారు.

భీమిని: వెంకటాపూర్ ఉన్నత పాఠశా లలో పీజీ హెచ్ ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణమూర్తికి ఎంఈవోగా అదనపు బాధ్యతలు కేటాయించారు.

కన్నెపల్లి: కేజీబీవీ పాఠశాలలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం ఆరు చార్జింగ్ బల్బులను పెట్టించారు.

నస్పూర్: నస్పూర్ పట్టణం తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు.

గర్మిళ్ల: తిరుపతి లడ్డుని కల్తీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మంచి ర్యాల కోర్టు న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. తిరుమల తిరుపతి లడ్డు కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కోటపల్లి: కోటపల్లి మోడల్ స్కూల్, కళాశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఫిజిక్స్ (భౌతికశాస్త్రం) బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపా ల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జైపూర్: ఎంఈవోగా బి శ్రీనివాస్ బుధవారం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

భీమారం: మండల విద్యాధికారిగా కాచం సురేష్ బాధ్యతలు స్వీకరించారు.

కాసిపేట: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎఫ్‌ఆర్‌వో పూర్ణచందర్ అన్నారు. బుగ్గ ఆలయ ప్రాంతంలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

లాభాల వాటా పూర్తి స్థాయిలో చెల్లించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

నస్పూర్, సెప్టెంబరు 25: సింగరేణి కంపెనీలో వచ్చిన లాభాలను కార్మికులకు పూర్తి స్థాయిలో చెల్లించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆరోపించారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కంపెనీ 4,700 కోట్ల లాభాలను సాధిస్తే ఇందులో 1,550 కోట్లను కార్మికుల ఇవ్వాల్సి ఉండగా 790 కోట్లను లాభాల కార్మికులకు బోనస్‌గా చెల్లించడం బాధకరమన్నారు. యేటా ఒక శాతం పెంచుతూ వస్తున్నారని చెప్పారు. కాగా 33శాతంకు పైగా బోనస్‌ను చెల్లించాల్సి ఉన్న చెల్లించకుండా ఒడిశా కోల్ బ్లాక్‌ల అభివృద్ధికి ఖర్చు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వ సింగరేణికి చెల్లించాల్సిన 33 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కంపెనీని అప్పుల కుప్పల్లోకి నెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తోవలో వెళుతుందన్నారు. సింగరేణి ప్రాంతాల కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారని ఆశతో నియోజక వర్గాల్లో కార్మికులు ఓట్లు వేసి గెలిపించారన్నారు. జిల్లాలోని మూడు నియోజక వర్గాల ఎమ్మెల్యేలు బోనస్‌పై వైఖరిని ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. ఒక సీటు కోసం కమ్యూనిస్టు పార్టీ తాకట్టుపడిపోయిందన్నారు. కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసేది తామేనని రఘునాథ్ స్పష్టం చేశారు. దసరా పండగలోగా 1,550 ఓట్ల లాభాల వాటాను కార్మికులకు బోనస్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ, బీజేవేఎం నాయకులు అశ్విన్‌రెడ్డి, బింగి ప్రవీణ్, మిట్టపల్లి మొగిలి, పొనవేన సదనందం, సమ్రాజ్ రమేశ్, కొండ వెంకటేశ్, మహేందర్ వర్మ, చెల్ల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బెజ్జూరు, సెప్టెంబరు 25: మండల కేంద్రానికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాధితుడిని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు బషరత్‌ఖాన్, శ్రీవర్ధన్, నరేందర్‌గౌడ్, అమీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

పిల్లలను పాఠశాలలో చేర్పించిన యూత్ సభ్యులు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని ధరంపల్లి గ్రామానికి చెందిన లొంబడి పునాజీ 8 సంవత్సరాలక్రితం అనారోగ్యంతో మృతిచెందగా అతని భార్య కమల కూలి పని చేసుకుంటూ ఇద్దరు కుమారులను పోషిస్తోంది. విషయం తెలుసుకున్న శివరామ సాయి యూత్‌సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ సభ్యులతో కలిసి ఇద్దరు విద్యార్థులను మొగడ్‌దగడ్ ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో చేర్పించారు. అలాగే స్కూల్‌బ్యాగ్, బుక్కులు, పెన్నులు, డ్రెస్సులు, దుప్పట్లు అందజేశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కౌటాల, సెప్టెంబరు 25: మండలంలోని పంచాయతీకార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎంపీవో మహేందర్‌రెడ్డికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేవారు. పంచాయతీకార్మికులకు రూ.10లక్షల బీమా వర్తింపజేయాలని, పెండింగ్‌లో వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

సిర్పూర్(టి), సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజనఆశ్రమోన్నత పాఠశాలను ప్రత్యేకాధికారి ప్రభాకర్, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవో తిరుపతి బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగావంటశాల, భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేడి వేడి, నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పారిశుధ్యం, రక్షిత మంచినీటిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వారివెంట ప్రధానోపాధ్యాయుడు రవీందర్, సిబ్బంది ఉన్నారు. అలాగే ఆశ్రమ బాలికలపాఠశాలలో విద్యార్థు లకు ఆర్బీఎస్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహిం చారు. విద్యార్థులుఆరోగ్యంపైజాగ్రత్త పాటించాలన్నారు.

వట్టివాగు కాలువలో పడి రైతు మృతి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25: కాలువలో పడి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఈదులవాడ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదులవాడ గ్రామానికి చెందిన పురుషోత్తం(30) తన కుటుంబీకులతో పొలంపనులకు వెళ్లాడు. కూలీలకు నీరు తీసుకువచ్చేందుకు సమీప వట్టివాగు కాలువవద్దకు వెళ్లి ప్రమాదవశాతు అందులో పడి మృతిచెందాడు. సాయంత్రం పనులు ముగించుకొని వెళు తున్న స్థానికులు కాలువలోపడి ఉన్న పురుషోత్తం మృతదేహాన్ని గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి, సెప్టెంబరు 25: మండలకేంద్రంలోని బస్టాండుసమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని సాలెగూడ గ్రామానికి చెందిన నగోసే మధుకర్ టీఎస్20 2456 నంబర్‌గల ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అకస్మా త్తుగా పశువు అడ్డువచ్చింది. బండి కంట్రోల్ కాక ఆయన దాన్ని ఢీకొట్టి కిందపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రశాంత్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25: ఆసిఫాబాద్ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకున్నారు. స్థానిక పెద్దవాగు నుంచి ఇసుకను తరలించడానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లను ఆర్డీవో లోకేశ్వర్, సీఐ సతీష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రోహిత్, ఆర్‌ఐలు సాయిప్రసాద్, రహీం అక్కడికి చేరుకొని ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

20లీటర్ల గుడుంబా..

చింతలమానేపల్లి, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం గూడెం నుంచి బైక్‌పై చింతలమానేపల్లికి 20లీటర్ల గుడుంబాను తరలిస్తున్న జాడెకుమార్‌ను పట్టుకు న్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ మేరకు బైక్‌ను సీజ్‌చేసి కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధులు భావితరాలకు మార్గదర్శకులు: కలెక్టర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 25: వయో వృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారిసంక్షేమం మనందరి బాధ్యత అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టర్‌లో జిల్లా మహిళా,శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు1న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల అవగాహన, వినోదాలవారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చాలన్నారు. వయో వృద్ధుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, వారిశ్రేయస్సుకోసం కృషి చేద్దామన్నారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26న వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం, ఆరోగ్యరక్షణపై అవగాహన కార్యక్రమాలు, 29న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మాజీప్రజాప్రతినిధులతో తల్లిదండ్రుల పోషణ, సంరక్షణచట్టంపై అవగాహన కార్యక్రమాలు, 30న అంగన్‌వాడీకేంద్రాల్లో గ్రాండ్‌పేరెంట్స్‌డే, మానవ సంబంధాలు-విలువలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అక్టోబరు 1న కలెక్టరేట్‌లో వయోవృద్ధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బాస్కర్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు శంకర్, లక్ష్మణ్‌రావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాలకు ఎంఈవోలు



జయరాజ్ (చింతలమానేపల్లి) హనుమంతు (కౌటాల) వేణుగోపాల్ (సిర్పూర్(టి))

కౌటాల, సెప్టెంబరు 25: కౌటాల ఎంఈవోగా హనుమంతు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జడ్పీ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ పథకం అయిన ప్రశస్త్‌పై నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంఈవో హను మంతు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఉపాధ్యాయుడు విద్యార్థులపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై శ్రద్ధ చూపెట్టాలన్నారు. అనంతరం ఎంఈవోను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్పీ శ్రీనివాస్, ఐఈఆర్పీ ప్రవళిక, హెచ్‌ఎంలు నారాయణసింగ్, నానాజీ, సుమన్, ఉల్లాజీ, సీఆర్పీలు ప్రకాష్, దేవన్న, రవికుమార్, లాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండల విద్యాధికారిగా పి జయరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో పీజీ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎంఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) ఎంఈవోగా వేణు గోపాల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోండి



గ్రామాల్లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

పెంచికలపేట, సెప్టెంబరు 25: అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్కపల్లి, కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న పలుసమస్యలు గ్రామస్థులు వారి దృష్టికితీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్డుమార్గం సరిగ్గాలేక గర్భిణులు, రోగులు తీవ్రఇబ్బంది ఎదుర్కొంటున్నారని శాశ్వతరోడ్డు నిర్మించి తమకష్టాలు తీర్చాలని వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో సబ్ హెల్త్‌సెంటర్‌ను నిర్మించాలని వారుకోరారు. మురళీగూడ గ్రామంలో మిషన్‌భగీరథ నీరు సరఫరా కావడం లేదని ఆయన దృష్టికితీసుకెళ్లారు. ప్రతి సంవత్సరం పెద్దవాగు, ప్రాణహితనది వరద ఉధృతికి వందలాది ఎకరాల్లో పంట నష్టపోతున్నా మన్నారు. సంబందితశాఖ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ వారికి హామీఇచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. పోతపెల్లి, చెడ్వాయి, గ్రామాలు ఆరోగ్య కేంద్రంపరిధిలో లేవని, వాటిని ఆరోగ్యకేంద్రం పరిధి లోకి తేవాలని మాజీసర్పంచ్ చంద్రమౌళి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై కొమురయ్య తదితరులు ఉన్నారు.

వర్షంలో.. జీపులో వెళ్లి..

మండలపర్యటనలోభాగంగా కమ్మర్‌గాం వెళ్లేసరికి ఒక్కసారిగా వర్షం కురవడంతో మురళీగూడ, జిల్లెడ గ్రామాలకు వెళ్లేరోడ్డు బురదమయంగా మారింది. వారి వాహ నాలు ముందుకు వెళ్లే వీలులేకపోయింది. దీంతో అటవీశాఖ జీపులో అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ప్రయాణించి గ్రామాలకు చేరుకున్నారు.

హ్యాండ్‌బాల్ ప్రాబబుల్స్ జట్ల ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 25: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ బాలికల క్రీడాపాఠశాలలో బుధవారం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పురుషులు, మహిళల జిల్లాజట్ల ఎంపికపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ సెలక్షన్‌లో భాగంగా 250 మంది క్రీడాకారులు హాజరుకాగా పురుషుల జట్టుకు 21 మంది, మహిళాజట్టుకు 21మందిని ఎంపిక చేశామని ప్రిన్సిపాల్ రహీం, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ తెలిపారు. అక్టోబరు2న టీంకు కావాల్సిన 16మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేస్తామని చెప్పారు. వీరు అక్టోబరు 9,10,11తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జంగు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్, మీనారెడ్డి, గురువేందర్, కళ్యాణ్, అరవింద్, రాకేష్, రవి, గౌరి, హారిక, చిన్నక్క, యాదగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన మహిళల జట్టు



ఎంపికైన పురుషుల జట్టు

గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలి

జైనూరు, సెప్టెంబరు 25: గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మొక్కలను పరిరక్షించాలన్నారు. అనంతరం పలు సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం..

జైనూరు ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించటంతో పంచాయతీకార్మికులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం వైస్ ప్రెసిడెంట్ పుష్ప, కార్యదర్శి కొద్ది, నాగేశ్వర్, కోశాధికారి జగన్, మానిక్ రావు తదితరులు పాల్గొన్నారు.



న్యాస్‌లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

దండేపల్లి, సెప్టెంబరు 25: జాతీయ సాధన సర్వేలో (న్యాస్)లో జిల్లాను అగ్రగామిగా నిలిపేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బీసగోని శంకర్‌గౌడ్ సూచించారు. బుధవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన్నారం, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అదుకున్న పాత రమేశ్, ఇప్ప రవిని సహ ఉపాధ్యాయులు సన్మానించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ



కూరగాయల మార్కెట్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

బెల్లంపల్లి, సెప్టెంబరు 25: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద రూ. 7.58 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గడిచిన 9 నెలల వ్యవధిలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఎన్నో ఏండ్లుగా కూరగాయల వ్యాపారులు మార్కెట్ భవనం లేక ఇబ్బందులు పడ్డారన్నారు. అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ కూరగాయల వ్యాపారులందరికి అన్ని వసతులతో కూడిన భవనం నిర్మించామన్నారు. అలాగే అమృత్ 2.0 పథకం కింద రూ. 61 కోట్లతో త్వరలోనే పట్టణ ప్రజలందరికి గోదావరి నీరు అందిస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. 108 స్టాళ్లకు గారూ 75 మంది మాత్రమే డిపాజిట్ చెల్లించారని, మిగితా వారికి నెల రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. సద్వినియోగం చేసుకోవాలని లేకపోతే ఇతర వ్యాపారులకు స్టాళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అనంతరం కాల్‌టెక్స్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూ. 98 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు మెగావాట్ల సామర్థ్యం గల పీటీఆర్‌ను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, నాయకులు ముచ్చర్ల మల్లయ్య, సూరిబాబు, చిలుముల శంకర్, విద్యుత్ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 25: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్ పట్టణంలో కూరగాయలమార్కెట్ ప్రారంభోత్సవానికి బుధవారం వచ్చిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామిలకు వినతిపత్రం అందించారు. బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడి ఉందని, అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్‌చేయాలని, ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని, సింగరేణి ఏరియా ఆసు పత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సతీష్‌కుమార్, ఆనంద్, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇప్పించాం



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 25: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ తెలిపారు. గోదావరిఖనిలో బుధవారం నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు కూడా కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదన్నారు. సింగరేణి లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కూడా ఉందన్నారు. త్వరలోనే సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మిక సంఘాన్ని ఐఎన్‌టీయూసీ అనుబంధంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు జనక్ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మందమర్రి నాయకులు కాంపెల్లి సమ్మయ్యమిట్ట సూర్యనారాయణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్,ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు బుధవారం రాత్రి రిటైర్డు కార్మికులు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. గోదావరిఖనిలో ఆయనను కలిసి వినతి పతం ఇచ్చారు. సంస్థ అభివృద్ధి కోసం నాలుగు దశాబ్దాలు పనిచేసినా తమ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపడం లేదన్నారు. 11వ వేజ్‌బోర్డు పింఛన్ అమలయ్యేలా చూడాలని కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత వారుంటున్న క్వార్టర్లను వారికే కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో. వాసాల శంకర్, కంబాల రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు షురూ



మార్కెట్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న చిరు వ్యాపారులు

- ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా
- రెండు రోజులుగా తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- బడా షాపింగ్ మాల్స్‌పైనా దృష్టి సారించాలని డిమాండ్



శ్రీనివాస్ టాకీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వెలిసిన అక్రమ నిర్మాణాలు

మంచిర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారం, అంగబలంతో కొందరు రాజకీయ నాయకులు, వ్యాపారులు ఇంతకాలం ప్రభుత్వ భూములు, ఫుట్‌పాత్‌ల్లో ఏర్పాటు చేసుకున్న అక్రమ నిర్మాణాలపై ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో రోజు రోజుకూ విస్తరిస్తున్న ఆక్రమణలపై ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే జిల్లా కేంద్రంలోని వివిధ ఏరియాల్లో పర్యటిస్తూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని స్వయంగా సూచించారు. దీంతో అప్రమత్తమైన చిరు వ్యాపారులు ముందస్తుగా తమ ఆక్రమణలను తొలగిస్తున్నారు. బడా వ్యాపారులు మాత్రం తమ పలుకుబడిని ఉపయోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పెద్ద సంఖ్యలో..

జిల్లా కేంద్రంలో గత పది పదిహేను సంవత్సరాలుగా ఫుట్‌పాత్‌లను ఆనుకొని వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చిరువ్యాపారులు టేలాలు ఏర్పాటు చేసు కొని జీవనం సాగిస్తుండగా, కొందరు రాజకీయ నాయకులు సైతం తమ చేతివాటం ప్రదర్శించారు. ఫుట్‌పాత్‌లను ఆనుకొని, వ్యాపారాలకు అనువుగా ఉండే స్థలాలపై కన్నేసిన నాయకులు తమ పలుకుబడితో వివిధ ప్రాంతాల్లో టేలాలు ఏర్పాటు చేశారు. వాటిని చిరువ్యాపారులకు కిరాయకు ఇస్తూ నెల వారీ అద్దె రూపంలో వేలల్లో దోచుకుంటున్నారు. అయినా ఇంతకాలం వాటిపై ప్రశ్నించే నాథుడే కరువయ్యారు.

ఈ క్రమంలో పట్టణంలో ప్రధాన సెంటర్లయిన జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మార్కెట్ రోడ్డు, బాలికల హై స్కూల్, ఐబీ ప్రాంతంతో పాటు టూ టౌన్‌గా పిలవబడుతున్న హమాలివాడలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వాటి వెనుక అధికార పార్టీలకు చెందిన ప్రజా ప్రతి నిధుల అండ ఉండగా, నెలకు లక్షల రూపాయలు కిరాయిల రూపంలో చేతులు మారుతుండేవి. గతంలో ఏసీపీగా పనిచేసిన విజయ్‌కుమార్ నేతృత్వంలో మున్సిపల్ అధికారులు అక్రమ టేలాలపై దృష్టిసారించారు. తొలగించేందుకు ప్రయత్నించినా, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు.

వాహనాల పార్కింగ్‌కు..

జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ప్రస్తుతం వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విపరీతమైన ట్రాఫిక్ కారణంగా ముఖ్యంగా మార్కెట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. బహుళ అంతస్తుల భవనాల్లో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. బహుళ అంతస్థుల భవనాల సెల్లార్లలో పార్కింగ్‌కు స్థలం వదిలి వేయాల్సి ఉండగా, యజమానులు వాటిని కూడా అద్దెకు ఇవ్వడంతో వాహనాలు రోడ్డుపైన నిలపాల్సి వస్తోంది. ఎప్పటికప్పుడు సెల్లార్లను ఖాళీ చేయించడం ద్వారా పార్కింగ్ ఇబ్బందులు తొలగిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతుండగా, భవనాల యజమానులు సెల్లార్ల రూపంలో లక్షల్లో కిరాయలు దండుకుంటున్నారు. ప్రస్తుతం ఫుట్‌పాత్‌లను ఆనుకొని చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తున్నందున సెల్లార్ షాపింగ్‌లపైనా దృష్టి సారించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. సెల్లార్లను అత్యవసరంగా ఖాళీ చేయించడం ద్వారా వాహన పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ రోడ్డులో..

ఎమ్మెల్యే ఆదేశాలతో చిరువ్యాపారులపై కొరడా ఝుళిపిస్తున్న అధికారులు బడా వ్యాపార సంస్థలపైనా చర్యలు తీసుకుంటారా...? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా మార్కెట్ రోడ్డులో బడా షాపింగ్ మాల్స్ పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటికి ఆనుకొని నిర్మించిన మెట్లు దాదాపుగా ఫుట్‌పాత్‌ను ఆనుకొని నిర్మించారు. అవి తొలగిస్తేగానీ ఆక్రమణలు పోయి, రహదారులు పూర్వపు కళను సంతరించుకొనే అవకాశం ఉంది. అయితే పలుమార్లు బడా షాపింగ్ కాంప్లెక్స్‌ల మెట్లు తొలగించేందుకు అధికారులు ప్రయత్నించినా, ఒత్తిళ్ల కారణంగా అవి సఫలీకృతం కాలేదు. ప్రస్తుతం చిరు వ్యాపారస్థులకు చెందిన ఆక్రమణలు తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందున బడా వ్యాపారుల సంగతేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే గత నెలలో బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించిన మున్సిపల్ అధికారులు... ప్రస్తుతం మార్కెట్ రోడ్డులో ఇరువైపులా ఉన్న షెడ్లను కూల్చివేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను సైతం తొలగించాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. బాలికల ఉన్నత పాఠశాల రోడ్డుతో పాటు ఐబీ ప్రాంతం, ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలోని అక్రమ నిర్మాణాలను సైతం తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వందశాతం అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25: మంచిర్యాల జిల్లాలో వందశాతం అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి సత్యనారాయణతో కలిసి డీఆర్‌పీలు, లయన్స్‌క్లబ్ సభ్యులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి వృద్ధుల అక్షరాస్యులుగా మార్చాలన్నారు. జిల్లాలో నిర్వహించిన సర్వేలో సుమారు లక్షా 400 మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా సెర్ప్, మెప్మా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

● పోస్టర్ల ఆవిష్కరణ

నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాయలంలో ఇన్‌చార్జీ జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు మహేందర్‌లతో కలిసి వయో వృద్ధుల సంక్షేమ నియామవళి 2011 కార్యక్రమం సంబంధిత గోడప్రతులను కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. 26న వృద్ధాశ్రమాలు, డే కేర్ సెంటర్‌లలో క్రీడా, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 27న ఓవర్ బ్రిడ్జి నుంచిముఖరాం చౌరస్తా వరకు వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ చట్టం 2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు ఉంటుందన్నారు. 29న అంగన్‌వాడీ కేంద్రాల్లో,పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్‌డే, 30న సర్పంచు,పంచాయతీ కార్యదర్శులకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం 2007, వయోవృద్ధుల లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 14567పై అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హబ్ సమన్వయకర్త సౌజన్య, డీసీపీయూ ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ స్వరూపరాణి, పర్హానాబేగం, రాజ్యలక్ష్మీ, వసంత, హన్మంతు, సత్యనారాయణ పాల్గొన్నారు.

● ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు

ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో వారికి ధ్రువీకరణ పత్రాలు అందించనున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జీ జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణితో కలిసి ముగ్గురు ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణానికి చెందిన ముగ్గురు లింగమార్పిడి వ్యక్తులు దరఖాస్తు చేసుకోగా గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు అందించామని తెలిపారు.

మందమర్రి మార్కెట్‌లో కాలువలు కబ్జా

- నిర్మాణాలు తొలగించేందుకు నోటీసులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 25: మందమర్రి మార్కెట్ సెంటర్లో పలువురు కాలువలను కబ్జా చేశారు. మార్కెట్‌లో దాదాపు 200 పైగా దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఈ మేరకు మున్సిపల్ అధికారులు డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. కొద్ది కాలంగా కాలువలపై బండలు వేసి షెడ్లు వేస్తున్నారు. దీంతో కాలువలు చెత్తతో పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో నోటీసులు తీసుకున్న వారు నిర్మాణాలు తొలగించకుంటే హైడ్రా ద్వారా తొలగిస్తామన్నారు. వారికి ఇచ్చిన గడువు ముగియడంతో శుక్రవారం నుంచి మున్సిపల్ సిబ్బంది అక్రమ నిర్మాణాలను తొలగించనున్నారు.

రక్తదానంపై అవగాహన

గర్మిళ్ల, సెప్టెంబరు 25: మంచిర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో బుధవారం రక్తదానం, అవయవదానంపై అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం చైర్‌పర్సన్ లయన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా మెడికల్ కాలేజీలో విద్యార్థులకు రక్తదానం, అవయవదానంపై అవగాహన కల్పించామని చెప్పారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సులేమాన్, మాతాశిశు కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ వేద వ్యాస్, డాక్టర్‌రేఖ, లయ న్స్‌క్లబ్ వైస్‌ప్రెసిడెంట్ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరావాలి

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 25: గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం శనివారం నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నాకు తరలిరావాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు కోరారు. బుధవారం లక్షెట్టిపేట పట్టణంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 010 పద్దు కింద ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. అశాస్త్రీయమైన కాల నిర్ణయ పట్టికను సవరించాలన్నారు. మెస్ చార్జీలను పెంచాలని, వార్డెన్‌లను, కేర్ టేకర్‌లను నియమించాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. అన్ని గురుకులాలను కామన్ డైరెక్ట్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైం, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సయ్య, చంద్రమౌళి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేయాలి

నస్పూర్, సెప్టెంబరు 25: ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట బుధవారం తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రైవేట్ రంగాల్లో దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఎస్సీ ఇండస్ట్రీ సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు జాడి పోచన్న, మేదరి దేవవరం, రెడ్డి రమణ, దేవదాస్, యోసేపు, దుర్గ ప్రసాద్, సుర్మిళ్ల రవీందర్, గాజుల రవి కుమార్, నర్సింగ రావు, సతీష్, మొగిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు

బీజేపీ నాయకుల నివాళి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25: జిల్లా వ్యాప్తంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు బుధవారం ఘన నివాళి నివాళులు అర్పించారు. మంచిర్యాలలోని బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో నాయకులు పురుషోత్తం జాజు, వెంకటేశ్వర్‌రావు, లచ్చన్న, ప్రవీణ్, రాజు, రాకేష్, మల్లేష్, చిరంజీవి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలోని నర్సింగాపూర్‌లో బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌రెడ్డి, నాయకులు తిరుపతి, వెంకటి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, సురేష్, స్వామి, రాజ్‌కుమార్, సాయికుమార్, అజయ్, మహేష్ పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 15వ వార్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్మాల పోశం, పట్టణ ప్రధాన కార్యదర్శి కట్ట ఈశ్వరాచారి, పట్టణ ఉపాధ్యక్షుడు వైద్య శ్రీనివాస్, కార్యదర్శి ప్రభాకర్, నాయకుడు మోత్కూరు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని టేకులబస్తీలో బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ, నాయకులు సంతోష్‌కుమార్, కళ్యాణి, రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలోని ఐబీలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు శేషగిరి, కుమార్, మల్లేష్, శ్రీనివాస్, సురేష్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రఘునాథ్ వెరబెల్లి



చెన్నూరులో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు